క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం:మండలంలోని వీరపనేనిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి. హరిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరపనేనిగూడెంతో పాటు తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కంఢ్రిక, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, బీబీ.గూడెం, గొల్లనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్సవమూర్తులకు ఊరేగింపు



గన్నవరం:శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక పాతగన్నవరంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ పురవీధుల్లో ఊరేగుతున్నారు. శుక్రవారం రాత్రి ఆలయం నుంచి శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం ప్రారంభించారు. స్థానిక పాతగన్నవరం, చింతలపేట, సొసైటీపేట మీదుగా కొనసాగిన ఊరేగింపు శనివారం రాయ్‌నగర్, రామ్‌నగర్, శ్రీనగర్‌కాలనీకు చేరుకుంది. పల్లకి వాహనంపై తమ ఇళ్ల ముందుకు వచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని హారతులు పడుతున్నారు. ఇంకా మిగిలిన ప్రాంతాల్లో ఊరేగింపును పూర్తిచేసుకుని ఆదివారం రాత్రి ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకోనున్నట్లు కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు.

కర్మల భవనం నిర్మించాలని వినతి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ఎస్సీ శ్మశనవాటికలో కర్మల భవనం నిర్మించాలని పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణకు శనివారం వినతి పత్రం అందచేశారు. ఎవరైన మృతి చెందినప్పుడు సమాధి కార్యక్రమాలకు వెళ్లే ప్రజలు వర్షాకాలంలో, ఎండాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి కర్మల భవనం నిర్మించాలని కోరారు. కార్యదర్శిని కలిసిన వారిలో వార్డు సభ్యుడు కాటూరి శ్రీనివాసరావు, స్థానికులు పొరిటిగడ్డ దుర్గారావు, జూనపూడి రామదాసు, తదితరులున్నారు.

వికాస్ కళాశాలలో మాక్ పార్లమెంట్

నున్న(విజయవాడరూరల్): వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న కీలక పరిణామాలతో పాటు టెక్నాలజీలో వస్తున్న మార్పులను చర్చించారు. పార్లమెంట్‌లో జరిగే చర్చల మాదిరిగా విద్యార్థులు మాక్ పార్లమెంట్‌లో మాట్లాడారు. ఇలాంటి మాక్ పార్లమెంట్ చర్చలు విద్యార్థుల వికాసానికి ఎంతోగానో తోడ్పడతాయని కళాశాల వైఎస్ చైర్మన్ ఎస్.సత్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతులు బి.సురేష్, కళాశాల ప్రిన్సిపల్ బీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలి

పెనమలూరు: విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ వ్యవస్థలపై పట్టు సాధిస్తే అనేక ఉద్యోగ అవకాశాలు ఉంటాయని మలేషియాకు చెందిన ఇంటెల్ కార్పొరేషన్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ యడ్లపాటి అవినాష్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చిప్ తయారీ విధానం, సర్క్యూట్ డిజైన్‌లపై అధ్యయనం చేయాలని సూచించారు. అనలాగ్ లేఅవుట్‌డిజైన్, ఫిజికల్ డిజైన్, తదితర అంశాల పై పట్టుసాధించాలని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.వంశీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు చౌడేశ్వరకాలనీకి చెందిన మాదల జ్ఞానప్రసూనాంబ గత ఏడాది ఫిబ్రవరిలో ఆగిరిపల్లికి చెందిన ఫణీంద్ర కుమార్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త పశ్చిమగోదావరి జిల్లా వీరవాసంలో కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. పెళ్లి జరిగిన తరువాత నుంచి భర్త భార్యను ఆగిరిపల్లిలోనే ఉంచాడు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు చాలలేదని, అదనపుకట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో భర్తతో పాటు అత్త నాగమణి, మామ మురళీకృష్ణ, ఆడపడుచులు లక్ష్మీప్రసన్న, సుమఅనూషల పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వెద సాగు.. బహు బాగు

- ఆసక్తి చూపుతున్న రైతులు
- ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ కావటమే కారణం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



కంకిపాడు మండలం ప్రొద్దుటూరులో వెద పద్ధతిలో సాగు చేసిన వరి చేను

కంకిపాడు: సమస్యలను అధిగమించడానికి రైతులు భిన్నంగా ఆలోచించి వెదసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఖర్చులు తక్కువ, ఆదాయం సాధారణం కంటే అదనంగా వస్తుండటంతో కృష్ణాజిల్లాలో ఏటా వెద సాగు విధానం పెరుగుతూ వస్తోంది. నూతన విధానాలపై వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది.

పెరుగుతున్న వెద సాగు

కృష్ణాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.70లక్షల హెక్టార్లలో వరి సాగు జరుగుతోందని వ్యవసాయశాఖ అంచనా. ఆ మేరకు సాగు పనులు తుది దశకు చేరుతున్నాయి. సంప్రదాయ వరి సాగు విధానానికి భిన్నంగా 'వెద' పద్ధతిని రైతులు అనుసరిస్తున్నారు. గొర్రుతో సాగుకు సిద్ధం చేసిన పొలంలో నేరుగా వరి విత్తనాలు నాటే పద్ధతినే 'వెద' అంటారు. ఈ పద్ధతిలో గతంలో 25 వేల హెక్టార్ల నుంచి 30 వేల హెక్టార్లు మాత్రమే సాగు జరిగేది. రెండేళ్ల క్రితం 47,840 హెక్టార్లలో సాగు జరగ్గా, గతేడాది 50 వేల హెక్టార్లలో జరిగింది. ఈ ఏడాది సాగు పూర్తయ్యే సరికి 55 వేల హెక్టార్లు వెద సాగు విధానంలో వరి సాగు జరుగుతుందని అధికారుల అంచనా. తక్కువ నీటి వనరులు ఉన్న భూములు, ఇసుక కూడిన భూముల్లో ఈ పద్ధతిలో వరి సాగు చేసేందుకు అనుకూలం. దీంతో ఆయా ప్రాంతాల రైతులు ఈ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

తక్కువ నీటి యాజన్యం

సాధారణ సాగులో ఎకరాకు 30 కిలోలు విత్తనం నారుమడి పోస్తారు. నారుమడి సిద్ధం చేసి, భూమిని నాట్లకు అనువుగా దమ్ము చేయడం, నారుతీత, కూలీలతో నాట్లు వేయించడం, నారు దుబ్బు దశకు చేరుకునే సరికి యాజమాన్య ఖర్చులతో కలిపి రూ 13,500 ఖర్చు అవుతుంది. అదే వెద విధానంలో సాగు చేపడితే 12 నుంచి16 కిలోలు విత్తనం, నేరుగా గొర్రుతో భూమిలో నాటతారు. తక్కువ నీటి యాజమాన్యంతో సరిపోతుంది. నేరుగా విత్తితే కలుపు సమస్య ఉత్పన్నమవుతుంది. కలుపు యాజమాన్యంతో కలిపి మొక్క దుబ్బు దశకు చేరే సరికి రూ 8 వేలు వరకూ పెట్టుబడులు అవుతాయి. పంటకు గాలి, వెలుతురు సమృద్ధిగా అందటం, దుబ్బులు ఎక్కువగా అవ్వటం కారణంగా పంట దిగుబడులు సాధారణం వచ్చే దిగుబడి కంటే 3-5 బస్తాలు అధికంగా దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా. అవగాహన సదస్సుల్లో అధికారులు వెద సాగుతో ప్రయోజనాలు, నీటి యాజమాన్యం తక్కువగా ఉండటంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తుండటంతో ఏటా వెద సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

ప్రత్యామ్నాయంగా ..

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న ప్రధాన సమస్య కూలీల కొరత. సాగు మొదట్లో వలస కూలీలు వచ్చినా, పూర్తి స్థాయిలో సాగు అవసరాలు తీరని పరిస్థితి. దీంతో నారుతీత, నాట్లు వేసే సమయంలో కూలీ రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కూలీలు అందుబాటులో లేక నాట్లు ఆలస్యమైన పరిస్థితులు లేకపోలేదు. ప్రత్యామ్నాయంగా రైతాంగం వెదపై దృష్టి సారించి సాగులో నిమగ్నమవుతున్నారు.

లాభాలు మెండు

వెద పద్ధతిలో సాగు చేస్తే రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. నారు పెంచడం, నారుతీత, నాట్లు వేసే ఖర్చు ఉండదు. కలుపు సమస్యను గుర్తించి యాజమాన్య చర్యలు తీసుకుంటే సరిపోతుంది. పెట్టుబడులు తక్కువ, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ప్రయోజనాలను గుర్తించి అవగాహనతో సాగు చేస్తే రైతులు లాభాలను ఆర్జించొచ్చు.

– ఎస్.పద్మావతి,
జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

క్రమశిక్షణ కలిగిన నాయకుడు డాక్టర్ దుట్టా



డాక్టర్ దుట్టా నివాసంలో ఎంపీ బాలశౌరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహానేత వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన డాక్టర్ దుట్టా రామచంద్రరావు వైఎస్సార్ సీపీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడని, పార్టీ ఆవిర్భావం నుంచి బలోపేతం కోసం ఆహర్నిశలు కృషి చేశారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చెప్పారు. వైఎస్సార్ సీపీ సీనియస్ నేత డాక్టర్ దుట్టాను హనుమాన్‌జంక్షన్‌లోని ఆయన నివాసంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం కలిశారు. పార్టీ నియమావళిని తూ.చ తప్పకుండా పాటించే వ్యక్తి డాక్టర్ దుట్టా అని చెప్పారు. ఇటీవల ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎంపీ బాలశౌరి తీవ్రంగా ఖండించారు. డాక్టర్ దుట్టా మాట్లాడుతూ ఎంపీ బాలశౌరితో దాదాపు పాతికేళ్లుగా పరిచయం ఉందని, మహానేత వైఎస్సార్ శిష్యులుగా ఇద్దరం కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు. సినీ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పిన్నమనేని సిద్ధార్థ వైద్య సేవలపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీ, కృష్ణశేషాద్రి, విభాగాధిపతులు

గన్నవరం:రోగులకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల నిరంతరం కృషి చేస్తుందని సిద్ధార్థ అకాడమీ చైర్మన్, కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చిన్నఅవుటపల్లిలో ఉన్న పిన్నమనేని సిద్ధార్థ కళాశాలలో శనివారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గత 20 ఏళ్లుగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పొందుపరిచిన వివిధ విభాగాల పుస్తకాలను చదలవాడ ప్రచురించగా ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కృష్ణశేషాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చదలవాడ మాట్లాడుతూ వైద్య కళాశాల ద్వారా గత రెండు దశాబ్దాలుగా అతితక్కువ ఖర్చుతో రోగులకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అనేక వ్యాధులకు మందులతో పాటు శస్త్రచికిత్సలు ద్వారా నయం చేసినట్లు తెలిపారు. ఈ తరహా సేవలపై వైద్య విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు పుస్తకాల రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. రోగుల కేసు రిపోర్ట్‌లపై విభాగాధిపతులు, డాక్టర్లు, వైద్య విద్యార్థులతో కలిసి చర్చించుకోవడం ద్వారా వైద్య సేవల్లో మరింత పురోగతి సాధించవచ్చాని తెలిపారు. డాక్టర్ సుధా, కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రంగారావు, హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. కళ్యాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలో నూర్‌బాషా, దూదేకులకు గుర్తింపు



హుస్సేన్‌కు నియామక పత్రం అందజేస్తున్న బాజీ, చిన్నమస్తాన్

గన్నవరం: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన నూర్‌బాషా, దూదేకులకు గుర్తింపు ఇచ్చింది వైఎస్సార్ కుటుంబం మాత్రమేనని ఆ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల బాజీ పేర్కొన్నారు. మండలంలోని దావాజిగూడెంలో శనివారం నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు పులిమర్తి చిన్నమస్తాన్ నేతృత్వంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కారుమంచి హుస్సేన్, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా డి. రాజా రసూల్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా షేక్ ఖాదర్‌బీ, పెనమలూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా షేక్ సలీమ్ బాషాను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం బాజీ మాట్లాడుతూ నూర్‌బాషాలు, దూదేకుల అభ్యున్నతికి మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి నట్లు గుర్తుచేశారు. ఆయన తనయుడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి తమ సంక్షేమానికి మరింత తోడ్పాటు నందిస్తున్నారని చెప్పారు. నూర్‌బాషా, దూదేకులకు ఇంతగా మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. చిన్నమస్తాన్ మాట్లాడుతూ తమ సంఘం విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నూర్‌బాషా, దూదేకులకు షాదీతోఫా రూ. 50 వేలు నుంచి రూ. లక్షకు పెంచడం అభినందనీయమని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓటూరి రసూల్ సాహెబ్ నేతృత్వంలో గ్రామస్థాయి వరకు కార్యవర్గాలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పీరాంబీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి

కంకిపాడు: అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి తెలిపారు. పట్టణంలోని 5వ వార్డులో రూ.4.50 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు, 2వ వార్డులో రూ.1.25 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు చిట్టూరి కోటయ్యబాబు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం నెరవేర్చుదాం

పెనమలూరు: గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం నెరవేర్చుదామని గ్రామ సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం అన్నారు. చోడవరం గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు శేఖర్‌బాబు, కళాకారులు జగనన్న స్వచ్ఛ సంకల్పం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, డిజిటల్ చెల్లింపుల పై చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించి ప్రసంగించారు. వెంకటరత్నం మాట్లాడుతూ గ్రామంలో ప్లాస్టిక్ వాడకం నిలిపివేయాలని తెలిపారు. పంచాయతీలో పన్నులు చెల్లింపు డిజిటల్ పద్ధతి ప్రవేశ పెట్టినందున అవగాహన పొందాలని కోరారు. వణుకూరులో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు మదర్‌థెరిస్సా స్ఫూర్తి



మదర్‌థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న నూకల వెంకట సాంబశివరావు

ఉయ్యూరు: మదర్‌థెరిస్సా స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో నోబుల్ అవార్డు గ్రహీత మదర్‌థెరిస్సా జయంతి శనివారం నిర్వహించారు. మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సేవాభావం, దయాగుణం, ప్రేమతత్వానికి మదర్‌థెరిస్సా నిదర్శనమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు రామసత్య కిషోర్, నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్, నెల్లి రాంబాబు పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరు గ్రంథాలయంలో మదర్‌థెరిస్సా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కొలసాని రవికుమార్, పినమాల నాగకుమార్, ఎంజీ రవికుమార్, చాట్ల ప్రవీణ్, మట్టా హానోక్, గ్రంథాలయాధికారి రమణి పాల్గొన్నారు.

పెనమలూరు:కానూరులో శనివారం మదర్‌థెరిసా జయంతి చేశారు. గ్రామంలో మాతృహృదయ్ స్వచ్ఛంద సేవా సంస్థ, అశోక్ జిమ్ ఆధ్వర్యంలో మాతృమూర్తి మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ మదర్‌థెరిసా నిస్వార్థంగా సేవలు అందించారన్నారు. త్యాగమూర్తిగా ఆమె చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. మదర్‌థెరిసా స్ఫూర్తితో తాము అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. సీనియర్ బాడీబిల్డర్ షాజిత్, ప్రముఖులు పి.నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం...

అంబాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మదర్‌థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకొని సేవాభావం అలవర్చుకోవాలని లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ డైరెక్టర్ కె. హైమావతి సూచించారు. హైస్కూల్లో శనివారం మదర్‌థెరిస్సా జయంతి నిర్వహించారు. మదర్ సమాజానికి చేసిన సేవలను ఆమె విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుంచి సేవాభావం అలవర్చుకోవాలన్నారు. తొలుత మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అభివృద్ధి పనులకు తీర్మానం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు సచివాలయంలో శనివారం సర్పంచ్ వరి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో పొందు పరిచిన అంశాలను పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు పాలకవర్గ సభ్యులకు వినిపించారు. గ్రామంలోని మదునైని నివాస్ నుంచి పద్మ నిలయం వరకు సీసీ డ్రెయిన్, గణేష్ రెసిడెన్సీ వద్ద రూ. 1.80లక్షలతో కల్వర్టు నిర్మాణానికై తీర్మానించారు. రీ మోడలింగ్ పూర్తైయిన పంచాయతీ కార్యాలయంలో కుర్చీలు, టేబుల్స్ కొనుగోలు అంశం ఆమోదం పొందింది. పంచాయతీ కార్యాలయం పునర్నిర్మాణంలో తొలగించిన పాత ఇనుము, కిటికీలు, తలుపులు బహిరంగ వేలం నిర్వహించేందుకై ఉన్నతాధికారులను కోరే అంశాన్ని ఆమోదించారు. మే, జూన్, జూలై నెలల్లో జనన, మరణాల సంఖ్యను రికార్డు చేయుట, జమ ఖర్చుల వివరాలను పరిశీలించి ఆమోదం తెలపుట గురించి చర్చించారు. ఈ సమావేశంలో వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు...మండలంలోని పునాదిపాడు శివారు బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో పది మంది జూదరులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.25,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

98 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగుతో కంటి సమస్యలు దూరమవుతాయని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పునాదిపాడు సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. శిబిరంలో 98 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కళ్లజోళ్లు అవసరమైన వృద్ధుల పేర్లను ఉన్నతాధికారులకు నివేదించారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ చెత్త సేకరణ డబ్బాలు



ఉంగుటూరు మండల పరిషత్‌కు చేరిన డస్ట్ బిన్లు

ఉంగుటూరు: ప్రజలందరూ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగస్వాములైనపుడే మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్రమైన గ్రామాలు రూపొందుతాయని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామాలకు తడి, పొడి చెత్త సేకరణ డబ్బాలు శనివారం పంపిణీకి సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా వీధుల పరిశుభ్రతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త సేకరణకు గ్రీన్ డస్ట్ బిన్స్ 12196, బ్లూ డస్ట్ బిన్స్ 1296 మొత్తం 24,392 డబ్బాలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్దాల నాటి సమస్యకు మోక్షం

- గొడవర్రు ఎస్సీ కాలనీ శ్మశానవాటికకు సిమెంటు రోడ్డు నిర్మాణం
- వసతుల కల్పనతో గ్రామస్తుల హర్షం



సిమెంటురోడ్డును చూపుతున్న సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్

కంకిపాడు:గొడవర్రు ఎస్సీ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న దశాబ్దాల నాటి సమస్యకు మోక్షం లభించింది. శ్మశానవాటికకు వెళ్లే రహదారి ఎట్టకేలకు అభివృద్ధి జరగటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ శ్మశానవాటికకు సరైన రోడ్డు మార్గం లేక కాలనీ వాసులు దశాబ్దాల కాలంగా అవస్థలు పడుతున్నారు. సమస్యను గుర్తించి పంచాయతీ పాలకవర్గం, సర్పంచ్ మేరుగు విజయచంద్రశేఖర్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రూ.8 లక్షలు అంచనా వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. శ్మశానవాటిక ప్రధాన రహదారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు శనివారం చేపట్టారు. ఇటీవల రూ 1.91 లక్షలు అంచనా వ్యయంతో శ్మశాన వాటిక రోడ్డు వెంబడి విద్యుత్ లైన్ల ఏర్పాటు పూర్తి చేశారు. తాజాగా రోడ్డు నిర్మాణం కూడా పూర్తి కావటంతో ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది. రోడ్డు పనులను సర్పంచ్ మేరుగు విజయచంద్రశేఖర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి సహకారంతో గ్రామానికి అవసరమైన మరిన్ని నిధులను సమీకరించి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన సమర్థంగా సాగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెన్ను బాబూజీ, వేమూరి చిన్న, స్థానికులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డుకే అద్దెలు చెల్లించాలి



బోర్డు ఏర్పాటు చేస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారి

పెనమలూరు: యనమలకుదురులో జన్నతుల్ బఖి ఖబరస్తాన్, ఈద్గా, దుకాణలు వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకున్నందున ఇక నుంచి వక్ఫ్ బోర్డుకే షాపుల అద్దె చెల్లించాలని వక్ఫ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం వక్ఫ్ బోర్డు అధికారులు ఈద్గా వద్ద వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి పేరున స్వాధీన బోర్డును ఏర్పాటు చేశారు. 26 షాపులకు సంబంధించి నెంబర్లు వేశామని, ఇక మీదట వక్ఫ్‌బోర్డు బ్యాంకు ఖాతాలోనే అద్దెలు చెల్లించాలని స్పష్టం చేశారు. జన్నతుల్ బఖి ఖబరస్తాన్, ఈద్గా, దుకాణాలు నిర్వహణ వక్ఫ్ బోర్డు నిర్వహిస్తుందన్నారు. ఏదన్న సూచనలు, సలహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వైభవంగా బ్రహ్మంగారి జెండా ఉత్సవం



గ్రామంలో ఊరేగిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి జెండా



మహిళా డప్పు కళాకారుల బృందం విన్యాసాలు

కంకిపాడు: విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జెండా ఉత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో గల వీరబ్రహ్మేంద్రస్వామి జయధ్వజస్తంభం జెండా ఉత్సవం శ్రావణమాసం రెండో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బ్రహ్మంగారి జెండాను ఊరేగించారు. భక్తులు జెండాకు పూజలు చేశారు. అర్ధరాత్రి సమయంలో భక్తుల కోలాహలం నడుమ బొబ్బా గోపాలకృష్ణ, కృష్ణప్రియ దంపతుల పర్యవేక్షణలో జెండా ధారణ అత్యంత వైభవంగా సాగింది. మహిళా డప్పు కళాకారుల విన్యాసాలు అలరించాయి.

1న పేరంటాలమ్మకు గాజుల అలంకరణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని సెప్టెంబరు 1న అమ్మవార్లు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఈ అలంకరణ నిమిత్తం గాజులు సమర్పించదలచిన భక్తులు ఈనెల 31 ఉదయం 10 గంటలలోగా ఆలయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.